నాగాలాండ్‌లో ఓటర్లు లేక వెలవెలబోతున్న ఓ పోలింగ్ కేంద్రం

నాగాలాండ్‌లోని 6 జిల్లాల్లో 'జీరో' పోలింగ్!

కోహిమా: నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల ప్రజలు ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌తో ఓటింగ్‌ను బహిష్కరించడంతో ఆయా జిల్లాల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు దాదాపు 'సున్నా' శాతం పోలింగ్ నమోదైంది! 'ఫ్రంటియర్ నాగాలాండ్ టెరిటరీ(ఎఫ్‌ఎన్‌టీ)' పేరుతో ప్రత్యేక రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్(ఈఎన్‌పీవో) గత 15 ఏండ్లుగా ఆందోళనలు చేస్తున్నది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని ఆ సంఘం ఇటీవల ఆరు జిల్లాల ప్రజలకు పిలుపునిచ్చింది. ఆరు జిల్లాల పరిధిలో ఉండే 20 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా ఓటేయలేదని తెలుస్తున్నది.

తొలి దశ పోలింగ్ 62%

- గత ఎన్నికలతో పోలిస్తే 7 శాతం తగ్గిన ఓటింగ్
- మణిపూర్, బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు
- ఛత్తీస్‌గఢ్‌లో గ్రనేడ్ పేలి జవాన్ మృతి
- రాత్రి 7 గంటల తర్వాత కూడా సాగిన పోలింగ్

న్యూఢిల్లీ, కోల్‌కతా, ఇంఫాల్, ఏప్రిల్ 19: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల మొదటి అంకం శుక్రవారం విజయవంతంగా పూర్తయింది. చెదురుమదురు ఘటనలు, కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు మినహా తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కోట్లాది మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 102 సీట్లకు 21 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగిన పోలింగ్‌లో రాత్రి 7 గంటల వరకు 62 శాతం పోలింగ్ నమోదైంది. అయితే 2019 ఎన్నికలు (69.43 శాతం) మొదటి విడతతో పోలిస్తే ఇది తక్కువేనని ఈసీ తెలిపింది. పోలింగ్ సాయంత్రం ఆరు గంటలకే ముగిసినా, కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు బారులు తీరడంతో రాత్రి 7 గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది. మొదటి విడత ఎన్నికల్లో 1600 మందికి పైగా అభ్యర్థులు పోటీ పడగా, వారిలో 8 మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు. మొదటి విడత పోలింగ్‌లో అత్యధికంగా తమిళనాడులో-39, రాజస్థాన్‌లో-12, ఉత్తర ప్రదేశ్‌లో-8, మధ్య ప్రదేశ్‌లో-6, ఉత్తరాఖండ్‌లో-5 లోక్‌సభ స్థానాలలో ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు అరుణాచల్ ప్రదేశ్ (60), సిక్కిం (32) అసెంబ్లీలకు కూడా శుక్రవారమే పోలింగ్ జరిగింది.

ఈవీఎంలపై ఫిర్యాదులు

ఛత్తీస్‌గఢ్, మణిపూర్, బెంగాల్ రాష్ట్రాల్లో చెదురుమదురు ఘటనలు మినహా మిగతా రాష్ట్రాల్లో పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. పలు చోట్ల ఈవీఎంలు పనిచేయలేదంటూ ఫిర్యాదులు అందాయి. అయితే అధికారులు వెంటనే కలుగజేసుకుని వాటి స్థానంలో వేరేవి ఏర్పాటు చేశారు. తమిళనాడులో ఇద్దరు వృద్ధులు పోలింగ్ బూత్‌లలో మరణించారు.

మణిపూర్‌లో గాల్లోకి కాల్పులు

తొలి దశ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకొన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని గాల్గమ్ గ్రామంలో అండర్ బ్యారెల్ గ్రనేడ్ లాంచర్(యూబీజీఎల్) ప్రమాదవశాత్తూ పేలడంతో విధులు నిర్వర్తిస్తున్న జవాన్ మృతి చెందాడని అధికారులు తెలిపారు. మరో ఘటనలో బైరాంగఢ్ పోలీసుస్టేషన్ పరిధిలోని చిహ్కా పోలింగ్ కేంద్రం సమీపంలో నక్సలైట్లు అమర్చిన ఐఈడీ పేలి మరో సీఆర్‌పీఎఫ్ జవాన్ గాయపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో కూచ్‌బెహర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పలు చోట్ల టీఎంసీ, బీజేపీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. మణిపూర్‌లోని ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గం థమ్నాపోక్పి ఏరియాలో ఓటర్లను చెదరగొట్టేందుకు కొంత మంది సాయుధ వ్యక్తులు గాల్లోకి పలు రౌండ్ల కాల్పులు జరిపారని పోలీసులు తెలిపారు.

'ఈశాన్యం'పై కమలం ఆశలు

ఈసారి ఈశాన్య రాష్ట్రాలలో 22 నుంచి 25 ఎంపీ సీట్లను గెల్చుకోవాలని కమలం పార్టీ గట్టి ఆశతో ఉంది. అలాగే మమత ప్రభుత్వంపై ఏర్పడిన అసంతృప్తి ఈసారి తమకు బెంగాల్‌కు తమకు మరిన్ని సీట్లు తెస్తుందని ఆ పార్టీ భావిస్తున్నది. తమిళనాడులో ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి ఈసారి బ్రేక్ పడుతుందని, ఎస్ రాందాస్‌కు చెందిన పీఎంకే లాంటి చిన్న పార్టీలతో ఏర్పాటు చేసుకున్న పొత్తు మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నది. బీహార్‌లో నితీశ్‌తో పొత్తు అనుకూలిస్తుందని భావిస్తున్నది.

నాగపూర్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన యువ ఓటర్లు

ఇండియా కూటమి ఆపసోపాలు

ఎట్టి పరిస్థితుల్లో బీజేపీని అధికారంలోంచి దించాలన్న ఏకైక లక్ష్యంతో ఏర్పడిన ఇండియా కూటమికి ఆదిలోనే అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. ఆ కూటమిలో ప్రధాన పాత్ర పోషించిన బీహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రధాని మోదీతో చేతులు కలిపి ఎన్డీఏ కూటమిలో చేరడం ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చింది. దీనికి తోడు బెంగాల్‌లో పొత్తుకు మమతా బెనర్జీ నిరాకరించడం, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం వంటి చర్యలతో ఆ కూటమి కుదేలైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

రాష్ట్రాలు/యూటీల వారీగా పోలింగ్ శాతం (రాత్రి 7 గంటల వరకు)

అండమాన్ నికోబార్	56.87
అరుణాచల్ ప్రదేశ్	65.46
అస్సాం	71.38
బీహార్	47.49
ఛత్తీస్‌గఢ్	63.41
జమ్ము-కశ్మీర్	65.08
లక్షద్వీప్	59.02
మధ్య ప్రదేశ్	63.33
మహారాష్ట్ర	55.29
మణిపూర్	68.62
మేఘాలయ	70.26
మిజోరం	54.18
నాగాలాండ్	56.77
పుదుచ్చేరి	73.25
రాజస్థాన్	50.95
సిక్కిం	68.06
తమిళనాడు	62.19
త్రిపుర	79.90
ఉత్తర ప్రదేశ్	57.61
ఉత్తరాఖండ్	53.64
పశ్చిమ బెంగాల్	77.57

నా తిండిపై ఈడీ రాజకీయం: కేజ్రీవాల్

- వాళ్లు చెప్పేవన్నీ అబద్ధాలు.. పక్షవాతాన్ని కోరుకుంటానా?
- ఢిల్లీ సీఎం డైట్ చార్ట్‌పై వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ శుక్రవారం ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టులో ఈడీపై తీవ్ర విమర్శలు చేశారు. తాను జైలులో తింటున్న ఆహారంపై ఈడీ చిల్లర మల్లరగా వ్యవహరిస్తున్నదని, రాజకీయం చేస్తున్నదని ఆరోపించారు. తన వైద్యుడు రూపొందించిన డైట్ చార్ట్‌కు అనుగుణంగానే తాను ఆహారాన్ని స్వీకరిస్తున్నానని చెప్పారు. మరోవైపు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందిస్తూ, కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వడం లేదనే ఆరోపణలపై వైద్య నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

అనారోగ్య కారణాలను సాకుగా చూపి బెయిల్ పొందేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారన్న ఈడీ ఆరోపణలపై కేజ్రీవాల్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి కోర్టులో వాదనలు వినిపించారు. 'బెయిల్ పొందడానికి నేను పక్షవాతం రిస్క్ తీసుకుంటానా? నేను ఏం తిన్నా, అది నా అరెస్ట్‌కు ముందు నా వైద్యుడు రూపొందించిన డైట్ చార్ట్‌కు అనుగుణంగానే తింటున్నాను' అని కేజ్రీవాల్ చెప్పినట్లు కోర్టుకు తెలిపారు. 'ఇంటి నుంచి పంపించిన 48 భోజనాల్లో కేవలం మూడుసార్లు మాత్రమే మామిడి పండ్లు పెట్టారు. ఈడీ ఆరోపణలు పూర్తిగా తప్పు' అని కేజ్రీవాల్ తెలిపినట్లు సింఘ్వి కోర్టుకు చెప్పారు. ప్రతి రోజూ 15 నిమిషాలపాటు ఫిజిషియన్‌ను సంప్రదించేందుకు అనుమతించాలని కేజ్రీవాల్ కోర్టును కోరారు. ఖైదీని అయినంత మాత్రానికి గౌరవప్రదంగా, ఆరోగ్యంగా జీవించే హక్కు నాకు లేదా? అని ప్రశ్నించారు. కేజ్రీవాల్ ఆరోపణలను ఈడీ తోసిపుచ్చింది. కేజ్రీవాల్ తింటున్న ఆహారం డైట్ చార్ట్‌కు అనుగుణంగా లేదని తెలిపింది. ఆయనకు గల మధుమేహానికి చికిత్స చేయడానికి తగిన వైద్య సదుపాయాలు తీహార్ జైలులో ఉన్నాయని చెప్పింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వు చేసింది. దీనిపై అవసరమైతే, సమాధానాన్ని దాఖలు చేయాలని తీహార్ జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. సోమవారం తీర్పు వెలువడే అవకాశం ఉంది.

ఏ ప్రమాదమైనా జరగొచ్చు

ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేజ్రీవాల్ ఆరోగ్యంపై జైలులో భారీ కుట్ర జరుగుతున్నదని, ఏ క్షణంలోనైనా, ఏ ప్రమాదమైనా జరగొచ్చునని అన్నారు. హత్య చేసే స్థాయికి బీజేపీ దిగజారగలదని, కేజ్రీవాల్ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే కుట్రలో భాగస్వాములయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆప్ ఆరోపణలు తప్పు: బీజేపీ

కేజ్రీవాల్‌ను జైలులో హత్య చేసేందుకు కుట్ర జరుగుతున్నదని ఆప్ చేసిన ఆరోపణలను బీజేపీ ఖండించింది. బీజేపీ అధికార ప్రతినిధి షాజియా ఇల్మి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తామంతా కేజ్రీవాల్ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామని చెప్పారు. కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణించడానికి బాధ్యులం కావాలని ప్రభుత్వ వ్యవస్థ కానీ, జైలు యంత్రాంగం కానీ ఎందుకు కోరుకుంటాయని ప్రశ్నించారు.

బీజేపీకి ఓటర్ల షాక్!

సమస్యలు పరిష్కరించలేదని ఓటేయని 10 గ్రామాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని పది గ్రామాల ఓటర్లు కమలం పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించడం లేదంటూ ఎన్నికలను బహిష్కరించారు. తాగునీరు, రోడ్లు, వంతెనలు, వైద్య సదుపాయాలు వంటి సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీలోని పిలిభిత్ జిల్లా బాక్స్‌పుర్, పురరైనా, ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్, అర్జున్‌పుర్, గూలరభోజ, తదితర గ్రామాల్లో ఎన్నికలను బహిష్కరించారు.

150 సెట్ల ఈవీఎంల మొరాయింపు

గువాహటి: అస్సాంలోని ఐదు లోక్‌సభ స్థానాల పరిధిలో 150 సెట్ల ఈవీఎంలతోపాటు వాటికి సంబంధించి వీవీపాట్, బ్యాలెట్ యూనిట్లు వంటి 400కు పైగా కాంపోనెంట్లు మొరాయించాయి. దీంతో వాటిని వెంటనే మార్చాల్సి వచ్చింది. పోలింగ్‌కు 90 నిమిషాల ముందు నిర్వహించిన మాక్ పోలింగ్‌లో సమస్యను గుర్తించడంతో వెంటనే మార్చి పోలింగ్‌కు అంతరాయం లేకుండా చూడగలిగారు. పోలింగ్ మొదలయ్యాక కూడా వివిధ పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 40కిపైగా వీవీపాట్లతోపాటు ఆరు ఈవీఎం సెట్లను మార్చినట్టు అధికారులు తెలిపారు.

మీ ఓటు పదిలం: సీఈసీ

ప్రజల ఓటు భద్రంగా ఉంటుందని సీఈసీ రాజీవ్ కుమార్ శుక్రవారం భరోసా ఇచ్చారు. ఈవీఎంలు వంద శాతం సురక్షితమని ఆయన పేర్కొన్నారు.

సైన్స్ పవర్ హౌస్‌గా భారత్!

బ్రిటిష్ జర్నల్ నేచర్ అంచనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: భారతదేశం భవిష్యత్తులో 'సైన్స్ పవర్ హౌస్'గా మారే దిశగా అడుగులు వేయడానికి సిద్ధంగా ఉందని ప్రఖ్యాత సైన్స్ జర్నల్ 'నేచర్' పేర్కొంది. ఇటీవల కాలంలో భారత్‌లో సైన్స్ పరిశోధనలు, అభివృద్ధి కార్యక్రమాల్లో గణనీయమైన పెరుగుదల కనిపించిందని, ముఖ్యంగా ప్రైవేట్ రంగంలో అధికంగా ఉందని బ్రిటిష్ వీక్లీ తెలిపింది. గతేడాది భారత్ విజయవంతంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. అలాగే 2014-21 మధ్య దేశంలోని యూనివర్సిటీలు 760 నుంచి 1,113కు, ఏడు అదనపు ఐఐటీలు, రెండు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థలు స్థాపించడాన్ని గుర్తు చేసింది.

వేసవిలో 43% అధికంగా రైళ్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: గతంలో ఎన్నడూలేని విధంగా ఈ వేసవిలో అధిక సంఖ్యలో రైలు సర్వీసులను నడుపుతున్నట్టు రైల్వే శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. అధిక సంఖ్యలో ప్రయాణికులను తమ గమ్యస్థానాలను చేర్చేందుకు గతేడాదితో పోలిస్తే ఈ ఎండాకాలంలో 43 శాతం ఎక్కువగా రైలు ట్రిప్పులను ఆపరేట్ చేయనున్నట్టు తెలిపింది. డిమాండ్ నేపథ్యంలో భారతీయ రైల్వే ఈ ఏడాది సమ్మర్ సీజన్‌లో రికార్డు స్థాయిలో 9,111 ట్రిప్పులు(2023లో 6,369 ట్రిప్పులు) నిర్వహిస్తున్నామని పేర్కొన్నది. వీటిలో పశ్చిమ రైల్వే అధికంగా 1,878 రైలు సర్వీసులను నిర్వహించనుంది.

ఎన్ఎస్‌జీ చీఫ్‌గా నళిన్ ప్రభాత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ 'నేషనల్ సెక్యూరిటీ గార్డ్' (ఎన్ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. అలాగే ఒడిశా క్యాడర్ 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సప్నా తివారీని 'ఇంటెలిజెన్స్ బ్యూరో' (ఐబీ) స్పెషల్ డైరెక్టర్‌గా కేంద్రం నియమించింది. 'సీఆర్‌పీఎఫ్ అదనపు డీజీగా పనిచేస్తున్న నళిన్ ప్రభాత్ ఎన్ఎస్‌జీ చీఫ్‌గా 2028 ఆగస్టు 31వరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్డీఏకు 400 మార్క్ అనుమానమే

ప్రజల భ్రమలు తొలగిపోయాయి: టికాయిత్

ముజఫర్‌నగర్: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ చెప్పున్నట్లుగా ఎన్డీఏకు 400కు పైగా స్థానాలు రావడం సందేహాస్పదమేనని భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు నరేశ్ టికాయిత్ అభిప్రాయపడ్డారు. 400 స్థానాలు వస్తాయని ముందుగానే జోస్యం చెప్పడం విశేషమని, అలా చెప్తున్నవాళ్లు ఎన్నికల్లో పోటీ చేయడం ఎందుకని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల పట్ల ప్రజల్లో ఉత్సాహం కనిపించడం లేదన్నారు. పశ్చిమ యూపీలో 8 లోక్‌సభ నియోజకవర్గాల్లో శుక్రవారం పోలింగ్ జరిగింది. ఈ సందర్భంగా టికాయత్ మీడియాతో మాట్లాడారు. ప్రజల భ్రమలు తొలగిపోయాయని చెప్పారు.

కొనసాగుతున్న రైతుల నిరసనలు

పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతుల నిరసనలు మూడో రోజు కూడా కొనసాగాయి. అరెస్టయిన ముగ్గురు రైతులను విడుదల చేయాలనే డిమాండ్‌తో బుధవారం నుంచి వీరు రైల్వే పట్టాలపై ధర్నా చేస్తున్నారు.

పీఎం ఫ్రీ ల్యాప్‌టాప్ స్కీమ్‌ను నమ్మొద్దు

అది నకిలీ వార్త: ఏఐసీటీఈ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి ఉచిత ల్యాప్‌టాప్ పథకం అమలవుతున్నదంటూ బూటకపు వార్తలను కొన్ని సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లు ప్రచారం చేస్తున్నాయని ఏఐసీటీఈ తెలిపింది. ఈ పథకంతో ఏఐసీటీఈకి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇటువంటి ప్రకటనలను పట్టించుకోవద్దని అన్ని విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, విద్యార్థులను కోరింది. ఇటువంటి తప్పుడు వార్తలను ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిజమైన సమాచారం కోసం ఏఐసీటీఈ వెబ్‌సైట్ : https://www.aicte-india.orgను సందర్శించవచ్చు.

గవర్నర్ పాలన పేరుతో బీజేపీ బెదిరింపులు: శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 19: కర్ణాటకలోని విపక్ష బీజేపీపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు కొందరు ఇక్కడ శాంతి భద్రతలు దిగజారాయని, అందుకే గవర్నర్ పాలనను విధించే అవకాశం ఉందంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ విషయమై తమ ప్రభుత్వాన్ని బెదిరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గవర్నర్ పాలనను విధించడానికి ఆ పార్టీ డ్రామాలు ఆడుతున్నదని మండిపడ్డారు. వారి ఉద్దేశం ఏమైనా ఇక్కడ మాత్రం అది జరగదని స్పష్టం చేశారు. కాగా, గత 48 గంటల్లో రాష్ట్రంలో జరిగిన పలు నేర ఉదంతాలను బీజేపీ ప్రస్తావించింది. కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు దిగజారుతున్నాయని విమర్శించింది. దానిపై శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు భేషుగ్గా ఉన్నాయని, ఆ విషయంలో దేశంలోనే కర్ణాటక ఉత్తమంగా ఉందని పేర్కొన్నారు.

ఉదయాన్నే నా కన్నా ముందొచ్చారు!

ఓటర్లకు మేఘాలయ సీఎం కితాబు

ఓటేసి స్ఫూర్తి చాటిన పొట్టి మహిళ

వివిధ రాష్ట్రాల్లో ఓటేసిన ప్రముఖులు

న్యూఢిల్లీ: తొలి దశలో ఎన్నికల్లో 'మొదటి ఓటు నాదే కావాలి' అని ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ బూత్‌లకు తరలి వచ్చారు! మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ కే సంగ్మా కూడా అదే ఉత్సాహంతో తురాలోని పోలింగ్ కేంద్రానికి ఉదయం 6.30 గంటలకే చేరుకున్నారు. కానీ అప్పటికే చాలా మంది అక్కడ బారులు తీరి ఉండటాన్ని చూసి, ఆయన ఆశ్చర్యపోయారు. దీనిపై ఆయన స్పందిస్తూ, మొదటి ఓటు తనదే కావాలని కోరుకున్నానని, కానీ ఓటర్లు తన కన్నా ముందే బూత్‌కు చేరుకున్నారని, ఇది మంచి పరిణామమేనని చెప్పారు.

క్యూలో నిల్చొని ఓటేసిన రిటర్నింగ్ అధికారి

జమ్ము-కశ్మీర్‌లోని ఉధంపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆసక్తికర ఘటన జరిగింది. రిటర్నింగ్ అధికారి రాకేశ్ మిన్హాస్ కఠువా పట్టణంలోని పోలింగ్ బూత్ వద్ద క్యూలో నిల్చొని ఓటు వేశారు.

నడిచొచ్చి ఓటేసిన 102 ఏండ్ల బామ్మ

తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో 102 ఏళ్ల వృద్ధురాలు చిన్నమ్మాళ్ తన ఓటు హక్కును వినియోగించుకొని

ఓటు హక్కును వినియోగించుకుంటున్న అమ్మే

స్ఫూర్తిగా నిలిచారు. కొన్నిచోట్ల నవ వధూవరులు పెండ్లి అయ్యాక నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటు హక్కు వినియోగించుకొన్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ దంపతులు, ఆధ్యాత్మిక వేత్త జగ్గీ వాసుదేవ్, తమిళ సినీ ప్రముఖులు, ప్రపంచంలోనే అత్యంత పొట్టి మహిళ అమ్మే తదితరులు తమ ఓటు హక్కు వినియోగించుకొన్నారు.

డబ్బు పంచుతూ పట్టుబడిన బీజేపీ నేత

మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో ఓటర్లకు డబ్బు పంచుతూ బీజేపీ నగర శాఖ అధ్యక్షుడు అంకుర్ శుక్లా కెమెరాకు చిక్కారు. ఈ వీడియోను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది.

'ఎవరెస్ట్ మసాలా'లో పురుగు మందులు!

రీకాల్ చేయాలని సింగపూర్ ఆదేశం

హాంకాంగ్: భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న 'ఎవరెస్ట్ చేపల కూర మసాలా'లో పరిమితికి మించి పురుగుమందు అవశేషాలు ఉన్నట్టు సింగపూర్ ఫుడ్ ఏజెన్సీ (ఎస్ఎఫ్ఏ) ఆరోపించింది. దీంతో ఫిష్ మసాలా ప్యాకెట్లను రీకాల్ చేయాలని ఎస్ఎఫ్ఏ ఆదేశించింది. హాంకాంగ్‌లోని సెంటర్ ఫర్ ఫుడ్ సేఫ్టీ జారీ చేసిన నోటిఫికేషన్‌కు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నట్టు సింగపూర్ తెలిపింది. ఉత్పత్తులను వెనక్కి తీసుకునే ప్రక్రియ ప్రారంభించాలని ఎస్సీ ముత్తయ్య అండ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సూచించింది. అయితే ఈ ఆరోపణపై ఎవరెస్ట్ కంపెనీ ఇంకా స్పందించలేదు.

నెస్లే బేబీ ఉత్పత్తులపై దర్యాప్తుకు ఆదేశం

న్యూఢిల్లీ: నెస్లే కంపెనీ పిల్లల కోసం తయారు చేస్తున్న ఉత్పత్తుల్లో అత్యధికంగా చక్కెరను వాడుతున్నదని వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని ఆహార భద్రత, ప్రమాణాల సంస్థను(ఎఫ్ఎస్ఎస్ఏఐ) కేంద్ర వినియోగదారుల పరిరక్షణ వ్యవస్థ (సీసీపీఏ) ఆదేశించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా ఈ విషయమై ఎఫ్ఎస్ఎస్ఏఐకి నోటీసు ఇచ్చింది.



పిల్లల అప్పగింతకు వివాహేతర సంబంధం కారణం కాదు!

ముంబై, ఏప్రిల్ 19: వివాహేతర సంబంధం విడాకులు మంజూరు చేసేందుకు ఒక కారణంగా సరిపోతుంది కానీ, పిల్లల సంరక్షణ బాధ్యత అప్పగించే విషయంలో కాదని ఓ కేసు విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు అభిప్రాయపడింది. తొమ్మిదేండ్ల కూతురి సంరక్షణను తల్లికి అప్పగిస్తూ న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ పాటిల్ తాజాగా తీర్పునిచ్చారు. 2023 ఫిబ్రవరిలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ భర్త వేసిన పిటిషన్‌ను ఈ నెల 12న కొట్టివేశారు. తన క్లయింట్ భార్యకు వివాహేతర సంబంధం ఉన్నదని, కూతురి కస్టడీని ఆమెకు అప్పగించడం సరికాదని పిటిషనర్ న్యాయవాది వాదించారు. అయితే ఈ వాదనలను జస్టిస్ పాటిల్ తిరస్కరించారు. మంచి భార్య కాకపోయినందున, ఒక మంచి తల్లి కూడా కాకుండా పోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారం

క్షిపణులు, డ్రోన్లతో అణు స్థావరాలు లక్ష్యంగా దాడి

జెరూసలేం, ఏప్రిల్ 19: తమపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడికి ఇజ్రాయెల్ ప్రతీకార దాడికి దిగింది. ఇరాన్‌లో అణు కార్యక్రమాలకు కేంద్రంగా ఉన్న ఇస్ఫహాన్ నగరంపై శుక్రవారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు దక్షిణంగా 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇస్ఫహాన్ ఇరాన్ మిలటరీకి ప్రధాన ఎయిర్‌బేస్‌గా కూడా ఉంది. నగరంలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని, ఆకాశంలో డ్రోన్లు కన్పించాయని, అయితే అవి దేనికో అర్థం కాలేదని స్థానికులు తెలిపారు. ఆ నగరంలో అతిపెద్ద సైనిక శిబిరంతో పాటు పలు అణు కేంద్రాలు ఉండటంతో ఇరాన్‌ను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇజ్రాయెల్ ఈ దాడికి పాల్పడి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇజ్రాయెల్ దాడితో అప్రమత్తమైన ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలను మోహరించడమే కాక, గగనతల రక్షణ వ్యవస్థను సిద్ధం చేసినట్టు తెలిపింది. తాము జరిపిన దాడుల గురించి ఇజ్రాయెల్ మిలటరీ ఎలాంటి ప్రకటన చేయలేదు.

గగనతలం మూసివేత..

ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్‌లోని గగనతలాన్ని మూసివేశారు. పౌర, వాణిజ్య విమాన సర్వీసుల రాకపోకలను నిలిపివేశారు. కొన్ని విమానాలను దారి మళ్లించగా, మరికొన్నింటిని వేరే విమానాశ్రయాల్లో ల్యాండింగ్ చేశారు. దీంతో ఏం జరుగుతుంతో తెలియక ప్రయాణికులు అయోమయానికి గురయ్యారు. దుబాయ్ కేంద్రంగా నడుస్తున్న ఎమిరేట్స్, ఫ్లయ్ దుబాయ్ సంస్థలు ఎలాంటి కారణం వెల్లడించకుండా పశ్చిమ ఇరాన్‌కు వెళ్లాల్సిన విమానాలను దారిమళ్లించాయి. కాగా, మధ్య ప్రాచ్యంలో జరుగుతున్న తాజా పరిణామాలపై యూఎస్ స్టేట్ సెక్రటరీ ఆంటోనీ బ్లింకెన్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

ఉద్యోగులూ.. ఇష్టం వచ్చినట్టు చేయొద్దు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: దిగ్గజ కంపెనీ గూగుల్‌లో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో సంస్థ సీఈవో సుందర్ పిచ్చాయ్ ఉద్యోగులకు గట్టి హెచ్చరికలు చేశారు. ఇది పని ప్రదేశమని, వ్యాపారపరంగా సంస్థ పాలసీలు, అంచనాలు స్పష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయాలు, ఇతర పలు అంశాలకు సంబంధించి కంపెనీని వ్యక్తిగత వేదికగా వినియోగించొద్దని, ఇతర ఉద్యోగుల్లో అభద్రతా భావం కలిగించొద్దని అయన తన బ్లాగ్ పోస్టులో పేర్కొన్నారు. గూగుల్ సంస్థ ఇజ్రాయెల్‌తో పనిచేస్తున్నదని ఆరోపిస్తూ కొన్ని గంటలపాటు ధర్నా చేసిన తొమ్మిది మంది సంస్థఉద్యోగులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాతి రోజున ఈ ఆందోళన